ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 356 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 1 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దీదీ

'200 సీట్లు గెలవండని' బీజేపీకి సవాల్

2లో..

# పొలాల బాట పట్టిన కేసీఆర్

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చూసి గుండె బరువెక్కి మాట్లాడుతున్నట్టు చెప్పిన కేసీఆర్.. ఇలాంటి పరిస్థితులు మళ్లీ చూస్తాననుకోలేదన్నారు. రాష్ట్రంలో నెలకొన్న దుర్భర పరిస్థితులను చూస్తుంటే కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయని బాధపడ్డారు. మరోవైపు.. పార్టీ మారుతున్న నేతలపై కూడా కేసీఆర్ స్పందించారు.

### ఇలాంటి పరిస్థితులు చూస్తాననుకోలేదు

**కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి: కేసీఆర్ భావోద్వేగం**


**బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదు**

**ఎకరాకు 25 వేల పరిహారం చెల్లించాలి**



హైదరాబాద్, మార్చి 31 (ప్రభాత ఉదయం): తెలంగాణలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో పంటలు ఎండిపోయి.. రైతులు బోరుమంటున్నారు. ఈ క్రమంలోనే.. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ జిల్లాల్లో పర్యటించి.. ఎండిన పంటలను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకుని.. ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు. జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోని పలు గ్రామాల్లో పర్యటించిన తర్వాత.. మీడియా సమావేశం నిర్వహించిన కేసీఆర్.. సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ ప్రెస్ మీట్‌లో కరెంట్ కోతలు, సాగు తాగు నీటి సమస్యలతో పాటు పార్టీ వీడిన నేతలపై కూడా స్పందించారు కేసీఆర్. ప్రస్తుత పరిస్థితులను చూసి..

..మిగతా 2లో



# కాంగ్రెస్‌లో చేరిన కడియం

### కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్ గూటికి

**వరంగల్ ఎంపీగా కావ్యకు ఛాన్స్ !**

హైదరాబాద్, మార్చి 31 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు నేతలు కలిసొచ్చే పార్టీల్లోకి వలసలు వెళ్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు సిట్టింగ్ ఎంపీలు, సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. తాజాగా ఆ పార్టీకి మరో షాక్ తగిలింది. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తన కూతురు కడియం కావ్యతో కలిసి హస్తం గూటికి చేరుకున్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపా దాస్ మున్షీ, సీఎం రేవంత్ రెడ్డి వారికి కండువా కప్పి కాంగ్రెస్‌లో ఆహ్వానించారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించారు గులాబీ బాస్ కేసీఆర్. అయితే ఆమె పోటీ నుంచి అనూహ్యంగా తప్పుకున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పరిస్థితి బాగోలేదని.. ఓడిపోయే పార్టీ నుంచి పోటీ చేయబోనని ఆమెను కేసీఆర్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ గూటికి చేరుతున్నారంటూ ప్రచారం జరిగింది. దీపాదాస్ మున్షీ కడియం ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు కూడా. శనివారం అనుచరులతో సమావేశమైన కడియం పార్టీ మార్పుపై అనుచరులతో చర్చించారు. ప్రస్తుతం పార్టీ మారటమే సమంజసమని వారికి నచ్చజెప్పారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే కడియం కూతురు కావ్యకు వరంగల్ కాంగ్రెస్

..మిగతా 2లో

రాష్ట్రపతి చేతుల మీదుగా

# అద్వానీకి భారతరత్న ప్రదానం

### ప్రధాని మోదీ, అమిత్ షా హాజరు



న్యూఢిల్లీ, మార్చి 31 (ప్రభాత ఉదయం): భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి ఆదివారం భారతరత్న అందజేశారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. అద్వానీ ఇంట్లో జరిగిన ఈ సత్కారానికి ప్రభుత్వం తరుఫున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా 10 మంది

..మిగతా 2లో

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

### సీఎం కేజ్రీవాల్ అరెస్ట్‌పై విపక్షాల పోరుబాట




న్యూఢిల్లీ, మార్చి 31 (ప్రభాత ఉదయం): ప్రజాస్వామ్యాన్ని కాపాడండి నినాదంతో విపక్ష ఇండియా కూటమి ఢిల్లీలో భారీ ర్యాలీ తలపెట్టింది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్ , కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులపై బీజేపీతో యుద్ధానికి సిద్ధమయ్యింది ఇండియా కూటమి. దీనిలో భాగంగా ఢిల్లీ

..మిగతా 2లో



కాంగ్రెస్ మోసాలను ఇంటింటికి వెళ్లి

# ప్రచారం చేయాలి

### కామారెడ్డి సభలో హరీశ్‌రావు

కామారెడ్డి, మార్చి 31 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ మోసాలను ఇంటింటికి ప్రచారం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి, సిద్దిపేట హరీశ్‌రావు సూచించారు. కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గులాబీ పార్టీని గుండెలకు హత్తుక్కు చరిత్ర కామారెడ్డిదన్నారు. ఉద్యమకారులున్న చైతన్యవంతమైన గడ్డ కామారెడ్డి అన్న ఆయన.. పార్టీ పెట్టిన రెండునెలలకే ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జడ్పీలు గెలిచామన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో అని మండలాలు గెలిచిమన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటుదామని పిలుపునిచ్చారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఉద్యమ కారుడు, ప్రజల్లోనే ఉంటారన్నారు. ఉద్యమ స్ఫూర్తితో పని చేసి అనిల్‌కుమార్‌ను గెలిపించుకుందామన్నారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అని కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలకు నిజమేంటో నిలకడమీద తెలుస్తుందని.. కాంగ్రెస్ మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని రేవంత్‌రెడ్డి అన్నారని.. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అన్ని గ్యారంటీలకు ఎగనామం పెడతారన్నారు. రుణమాఫీ ఎగ్గొట్టినా, రైతుబంధు ఇవ్వకున్నా తమకే ఓటేశారని

..మిగతా 2లో

# పోలీసులు X గిరిజనులు

**అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై దాడి**

**సత్తుపల్లి సీఐ కిరణ్, కానిస్టేబుళ్లకు గాయాలు**

**ఖమ్మం జిల్లా చంద్రాయపాలెంలో ఉద్రిక్తత**



సత్తుపల్లి, మార్చి 31 (ప్రభాత ఉదయం): గిరిజన వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదాన్ని పరిష్కరించేందుకు వెళ్లిన సత్తుపల్లి పోలీసులపై గిరిజనులు దాడికి దిగారు. ఘటన పూర్వాపరాలిలా.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు శివారు చంద్రాయపాలెం అటవీ ప్రాంతంలోని 400 హెక్టార్లలో కొంతకాలంగా స్థానిక గిరిజనులు, స్థానికేతర గిరిజనుల మధ్య పోడు వివాదం నడుస్తోంది. గిరిజనులకు నేతృత్వం వహిస్తున్న కూరం మహేంద్రను అటవీశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు శనివారం సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు సీఐ టి.కిరణ్ పిలిపించి విచారించి పంపించారు. ఈక్రమంలో చంద్రాయపాలెంకు చెందిన గిరిజనులు ఆదివారం ఉదయం డయల్ 100కు ఫోన్ చేసి స్థానికేతర గిరిజనులు తమ భూముల్లోకి వస్తున్నారంటూ ఫిర్యాదు

..మిగతా 2లో

# కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం

**ఆలేరు రైల్వే స్టేషన్ సమీపంలో విరిగిన పట్టా**

**సిబ్బంది అప్రమత్తతో తప్పిన ప్రమాదం**

2



హైదరాబాద్ నుంచి

# అయోధ్యకు ప్రత్యేక విమానం

హైదరాబాద్, మార్చి 31 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నుంచి అయోధ్య వెళ్ళే భక్తులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన ట్విట్టర్ వేదికగా తెలిపారు. హైదరాబాద్ నుంచి అయోధ్య వెళ్లే శ్రీరాముని భక్తులకు ప్రత్యేక విమానాలు అందుబాటులోకి

..మిగతా 2లో

# పొలాల బాట పట్టిన కేసీఆర్

**మొదటి పేజీ తరువాయి...**

గుండె బరువెక్కి, బాధతో మాట్లాడుతున్నానని కేసీఆర్ తెలిపారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాక ముందు రాష్ట్రంలో ఏటా 30, 40 లక్షల టన్నుల ధాన్యం కూడా ఉత్పత్తి అయ్యేది కాదని.. కానీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా 3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసి.. పంజాబ్‌కే పోటీగా నిలిచిందని కేసీఆర్ వివరించారు. అంత సుభిక్షంగా ఉన్న రాష్ట్రం పరిస్థితి ఇప్పుడు ఇంత అధ్వాన్నంగా మారడానికి కారణం ఎవరని.. లోపం ఎక్కడున్నదని కేసీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రైతులకు ఇంత దుర్భర పరిస్థితి వస్తుందని అనుకోలేదన్నారు కేసీఆర్. కేవలం 100 రోజుల పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పుకొచ్చారు. నాగార్జున సాగర్, సింగూరు ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా.. వాటిని సద్వినియోగం చేసుకుని రైతులకు నీళ్లు అందించలేకపోయారని దుయ్యబట్టారు. ఇది కాలం తెచ్చిన కరువు కానే కాదని.. ప్రభుత్వ అసమర్థత వల్ల వచ్చిన కరవేనంటూ స్పష్టం చేశారు కేసీఆర్. ఇక.. మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇంటికో నల్లా పెట్టి నీళ్లు ఇచ్చిన రాష్ట్రంలో తాగునీటికి కరువు ఎందుకొచ్చినట్టని కేసీఆర్ ప్రశ్నించారు. తమ హయాంలో ఎక్కడా నీళ్ల ట్యాంకర్లు కనపడలేదగని.. ఏ ఆడ బిడ్డ కూడా వీధుల్లో బిందెలు పట్టుకుని కనపడలేదని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు హైదరాబాద్ నగరంలో కూడా ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేసే దుస్థితి ఎందుకొచ్చిందని నిలదీశారు. ఇలాంటి పరిస్థితులు రాష్ట్రంలో మళ్లీ వస్తాయని.. తన కళ్లతో చూస్తానని అనుకోలేదని కేసీఆర్ బాదపడ్డారు. రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ బిందే పట్టుకుని నీళ్ల కోసం వీధుల్లోకి రావొద్దని, రైతులు ఎవ్వరు నీటి కోసం ఎదురుచూడొద్దని రాత్రింబవళ్లు కష్టపడి.. అన్ని రకాల వసతులు చేశామని కేసీఆర్ చెప్పుకొచ్చారు. రైతుల కోసం ఎన్నివేల కోట్లయినా పెట్టడానికి సిద్ధమని చెప్పి.. కరెంట్ లోటు రాకుండా చూసుకున్నామని తెలిపారు. కానీ.. ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే.. గుండె బరువెక్కుతోందని, కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయని కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వం




ఏర్పడిన నాలుగు నెలల తర్వాతే తాను మాట్లాడుతున్నానన్నారు. తనపై ఎంత మోటుగా, ఘాటుగా మాట్లాడినా పట్టించుకోలేదని, ప్రభుత్వానికి సమయం ఇద్దామనే సైలెంట్‌గా ఉన్నానని.. కానీ నేడు దయనీయమైన పరిస్థితులను చూశాక మాట్లాడక తప్పట్లేదని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ అసమర్థత వల్లే పంటలు ఎండిపోయాయి కాబట్టి.. పరిహారం ఇవ్వాల్సిందేనని కేసీఆర్ డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చి ఎన్యుమరేట్ చేయాలని సూచించారు. ఏ జిల్లాల్లో ఏ మండలంలో ఏ గ్రామంలో ఏ రైతు పంట ఎంత ఎండిపోయిందనే లెక్కలు తీయాలన్నారు. ధరలు అన్నీ పెరిగినయ్ కాబట్టి.. ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కేసీఆర్ డిమాండ్ చేశారు. పరిహారం ఇచ్చే దాకా ప్రభుత్వాన్ని వేటాడుతాం.. వెంటాడుతాం.. ధర్నాలు చేస్తామన్నారు.

ఇదిలా ఉంటే.. పార్టీ మారుతున్న నేతలపై కూడా కేసీఆర్ తొలిసారిగా స్పందించారు. ఒకరినో.. ఇద్దరినో.. కుక్కల్నో.. నక్కల్నో గుంజుకుని ఓహో ఆహా అని సంకలు గుద్దుకుంటున్నారంటూ కేసీఆర్ ఎద్దేవా చేశారు. అది చిల్లర రాజకీయ స్టంట్‌గా కేసీఆర్ అభివర్ణించారు. ప్రజల సమస్యల ముందు, ప్రజల బాధ ముందు.. ఎండిపోయిన పంటల ముందు చిల్లర రాజకీయాలు చేయడం సరికాదన్నారు కేసీఆర్. మహాసముద్రమంతా బీఆర్ఎస్ పార్టీ.. రైతులకు అండగా ఉందని కేసీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాన ప్రతిపక్షంగా.. రైతుల పక్షాన, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని.. అవసరమైతే ప్రభుత్వంతో యుద్ధం చేస్తామంటూ కేసీఆర్ తెలిపారు.



## కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం

### ఆలేరు రైల్వే స్టేషన్ సమీపంలో విరిగిన పట్టా
### సిబ్బంది అప్రమత్తతో తప్పిన ప్రమాదం

హైదరాబాద్, మార్చి 31 (ప్రభాత ఉదయం): ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ ఉదయం సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన రైలు యాదాద్రి జిల్లా ఆలేరు రైల్వే స్టేషన్ దాటుతున్న సమయంలో భారీశబ్దం వినిపించింది. దీంతో హడలిపోయిన ప్రయాణికులు రైలు సిబ్బందికి సమాచారం అందించారు. అప్రమత్తమైన అధికారులు రైలును నిలిపివేశారు. అనంతరం పట్టాలను పరిశీలించగా రైలు పట్టా విరిగినట్టు గుర్తించారు. వెంటనే విరిగిన పట్టాకు మరమ్మతులు చేశారు. అనంతరం అక్కడ్నుంచి రైలు బయలుదేరింది. పట్టా గమనించి ఉండకపోతే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని ప్రయాణికులు అంటున్నారు. ప్రమాదం తప్పడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. ఎవరైనా కావాలనే చేశారా..? లేక నాణ్యతా లోపం వల్ల పట్టా విరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



## రాష్ట్రపతి చేతుల మీదుగా అద్వానీకి భారతరత్న ప్రదానం

**మొదటి పేజీ తరువాయి...**

హాజరయ్యారు. హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్నారు. ఈ సమయంలో అద్వానీ కుటుంబం నుంచి 10 మంది కూడా హాజరయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అద్వానీ నివాసానికి చేరుకుని భారతరత్న అవార్డుతో సత్కరించారు. అద్వానీ ఆరోగ్యం, వృద్ధాప్యం వంటి కారణాల వల్ల ఇంట్లో సన్మాన కార్యక్రమం నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా , జేపీ నడ్డాతో పాటు పలువురు నేతలు కూడా అద్వానీ ఇంటికి చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ సంస్థాగత మంత్రి బీఎల్ సంతోష్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఉన్నారు. శనివారం మార్చి 30వ తేదీన రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని నలుగురు ప్రముఖులను భారతరత్నతో సత్కరించారు. ఇందులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి జననాయక్ కర్పూరీ ఠాకూర్, దేశ మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్, దేశంలోని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ఉన్నారు. ఈ నలుగురికీ మరణానంతరం దేశ అత్యున్నత పురస్కారం లభించింది. మరణానంతరం ప్రతి ఒక్కరికీ భారతరత్న అవార్డు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో దివంగత కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్ భారతరత్న అవార్డును అందుకున్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా పీవీ ప్రభాకర్ రావు తనయుడు, దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ గౌరవాన్ని అందుకున్నారు. మాజీ ప్రధానిగా, రైతుల దూతగా భావించే చౌదరి చరణ్‌సింగ్‌కు ఇచ్చిన భారతరత్నను ఆయన మనవడు జయంత్ చౌదరి అందుకున్నారు. దేశంలోని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా భారతరత్న అవార్డు లభించింది. రాష్ట్రపతి ముర్ము నుంచి ఆయన కుమార్తె నిత్యారావు ఈ గౌరవాన్ని అందుకున్నారు.


## కాంగ్రెస్‌లో చేరిన కడియం

**మొదటి పేజీ తరువాయి...**

ఎంపీ టికెట్ కన్ఫార్మ్ అయినట్లు తెలుస్తోంది. టికెట్ హామీతోనే కడియం పార్టీ మారినట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటి వరకు 13 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, ఖమ్మం స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించలేదు. ఇందులే వరంగల్ స్థానం నుంచి బలమైన అభ్యర్థిని బరిలోకి దింపాలని పార్టీ యోచిస్తోంది. అందులో భాగంగానే కడియంతో చర్చలు జరిపినట్లు సమాచారం. కడియం సానుకూలంగా స్పందించటంతో ఆయనతో పాటు కూతుర్ని పార్టీలో చేర్చుకొని కావ్యకు టికెట్ కన్ఫార్మ్ చేసినట్లు తెలిసింది. ఇవాళ కాంగ్రెస్ సీఈసీ సమావేశం జరగనుండగా.. ఆ భేటీలో మిగిలిన నాలుగు స్థానాలకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే సీఈసీ భేటీ కంటే ముందే కడియం కూతురితో కలిసి కాంగ్రెస్ గూటికి చేరారు. ఇవాళ సాయంత్రానికి వరంగల్ ఎంపీ స్థానానికి కావ్య పేరు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## ద్వారకలో ఘోర అగ్ని ప్రమాదం

### చిన్నారి సహా నలుగురు మృతి
### షార్ట్ సర్క్యూట్ వల్ల ఏసీలో సంభవించిన పేలుడు



ద్వారక, మార్చి 31 (ప్రభాత ఉదయం): గుజరాత్‌లో ఆదివారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. దేవభూమి ద్వారకలో జరిగిన ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సజీవదహనమయ్యారు. వీరిలో ఓ చిన్నారి కూడా ఉంది. ద్వారక నగరం ఆదిత్య రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులో తెల్లవారుజామున 3.30 గంటలకు మంటలు చెలరేగాయి. ఎయిర్ కండీషనర్ పేలుడు కారణంగా మంటలు చెలరేగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. కుటుంబం గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఘటన చోటుచేసుకుంది. దీంతో దట్టంగా పొగ కమ్మేసి వారు బయటకు వచ్చే అవకాశం లేక గదిలోనే ఊపిరాడక చనిపోయారు. ప్రమాదం గురించి స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలిలో ఓ వ్యక్తి, అతడి భార్య, ఎనిమిది నెలల కుమార్తె, మరో మహిళ అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. వెంటనే వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అదే భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నిద్రిస్తున్న వారి నాయినమ్మ మాత్రం ప్రాణాలతో బయటపడింది. మృతులను పవన్ ఉపాధ్యాయ్ (39), ఆయన భార్య తిథి (29), తల్లి భవానీబెన్ (69), ఎనిమిది నెలల కుమార్తె ధైనాగా గుర్తించారు.



## పోలీసులు X గిరిజనులు

**మొదటి పేజీ తరువాయి...**

చేశారు. దీంతో తొలుత ఎస్సై రాజు, ముగ్గురు పోలీసు సిబ్బంది వెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్న సమాచారంతో సీఐ టి.కిరణ్ మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి చేరుకున్నారు. అదే సమయంలో గిరిజన నేత కూరం మహేంద్ర ఫోన్‌లో మాట్లాడుతుండగా, 'నిన్ననే కదా నీతో మాట్లాడి పంపించింది.. మళ్లీ గొడవ ఏమిటి' అంటూ సీఐ కిరణ్ ఆయన ఫోన్ స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఇరువురి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఇంతలో ఒక్కసారిగా గిరిజన మహిళలు కోపోద్రిక్తులై సీఐ కిరణ్‌ను చుట్టుముట్టి పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారు. ఘటనా స్థలంలో ఉన్న కానిస్టేబుళ్లు పి.నర్సింహారావు, ఇమ్రాన్, సత్యనారాయణ, నరేష్ కలిసి సీఐ కిరణ్‌ను కాపాడుకునే ప్రయత్నంలో చుట్టూ రక్షణ కవచంలా నిలిచి పోలీస్ వ్యాన్ వైపు తీసుకొస్తుండగా గిరిజనులు కర్రలతో వెంబడించి దాడి చేశారు. అతి కష్టంమీద అక్కడి నుంచి సీఐ కిరణ్‌ను పోలీసులు తీసుకొని బయ టపడ్డారు. ఈ ఘటనలో సీఐ కిరణ్ చొక్కా చిరిగిపోయింది. విషయం తెలుసుకుని కల్లూరు ఏసీపీ రఘు, రూరల్ సీఐ వెంకటేశం, డివిజన్‌లోని ఎస్సైలు, పెద్ద సంఖ్యలో సిబ్బంది చంద్రాయపాలెం బయలుదేరారు. మార్గమధ్యలో బుగ్గపాడు శివారులో పోలీసులపై దాడి చేసిన గిరిజనులు గుంపులుగా వస్తుండగా పోలీసులు వారిని చుట్టుముట్టారు. గిరిజనులు ప్రతిఘటించటంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పి కూరం మహేంద్రతో సహా గిరిజనులను అదుపులోకి తీసుకున్నారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

**మొదటి పేజీ తరువాయి...**




రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నేతలు మెగా ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీకి కూటమిలోని 29 పార్టీలూ ర్యాలీలో పాల్గొనబోతున్నాయి. ముఖ్యంగా కేజ్రీవాల్ అరెస్ట్ , కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను ఐటీ శాఖ ఫ్రీజ్ చేయడంపై ఇండియా కూటమి భారీ నిరసనకు రెడీ అయ్యింది. ఢిల్లీ రాంలీలా మైదానంలో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నారు. పన్ను ఎగవేత కేసులో రూ.1800 కోట్లు చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇవ్వడంపై కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. ఢిల్లీలో జరిగే ర్యాలీలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ సహా కీలకనేతల పాల్గొనబోతున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు అడ్డంగా దుర్వినియోగం చేస్తోందని మండిపడుతున్నాయి విపక్షాలు. ఇవాళ్టి ర్యాలీలో ఇదే అంశాన్ని ప్రధానంగా జనంలోకి తీసుకెళ్లనున్నారు నేతలు. ఇవాళ్టి కార్యక్రమాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మద్యం కుంభకోణం కేసులో జైలుపాలైన నేపథ్యంలో ర్యాలీకి భారీ జనసమీకరణ చేసి సత్తా చాటాలన్న పట్టుదలతో ఉంది. జరిగే ఇండియా కూటమి ర్యాలీకి తృణమూల్ కాంగ్రెస్ కూడా హాజరవుతుందని తెలిపారు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ సభకు లోక్‌సభ ఎన్నికలతో సంబంధం లేదని , బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై పోరాటం కోసమే విపక్షాలు ఏకమవుతున్నట్టు తెలిపారు. విపక్ష నేతలను టార్గెట్ చేస్తున్న దర్యాప్తు సంస్థలకు బీజేపీకి అక్రమంగా అందిన ఎలక్ట్రోరల్ బాండ్స్ కన్పించడం లేదా అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల వేళ విపక్ష నేతలను అరెస్ట్ చేయడమే కేంద్ర దర్యాప్తు సంస్థలు పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు జైరాం రమేశ్..

## హైదరాబాద్ నుంచి అయోధ్యకు ప్రత్యేక విమానం

**మొదటి పేజీ తరువాయి...**

తీసుకొచ్చింది విమానయాన శాఖ. అయోధ్య వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అయోధ్యకు నేరుగా ఫ్లైట్ సౌకర్యం కల్పించమని ఫిబ్రవరి 26న కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియాకు లేఖ రాసినట్లు వివరించారు. దీనిపై స్పందించిన సింధియా ఏప్రిల్ 2 నుంచి ప్రత్యేక విమానాలు హైదరాబాద్ నుంచి అయోధ్యకు నడుపనున్నట్లు తెలిపారు. విమానయాన కంపెనీలతో మాట్లాడిన సింధియా వారానికి మూడు రోజులు ప్రత్యేక ఫ్లైట్లు హైదరాబాద్ నుంచి అయోధ్యకు నడపాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రైవేట్ విమాన సర్వీసు సంస్థలు మంగళ, గురు, శని వారాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపాయి. ఈ సేవలు ఏప్రిల్ 2 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు కేంద్ర మంత్రి. అడిగిన వెంటనే తమ అభ్యర్థనపై స్పందించి తెలుగు ప్రజలకు ఈ సౌకర్యాన్ని కల్పించినందుకు సింధియాకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలుపుతూ లేఖ రాశారు. ఈ లేఖను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. లేఖతో పాటు హైదరాబాద్ నుంచి అయోధ్యకు బుక్ చేసుకున్న టికెట్ కూడా జతచేశారు. దీంతో బాలరాముడి దర్శనం కోసం వేచి చూస్తున్న తెలుగు వారికి మరింత సౌకర్యవంతమైన ప్రయాణం చేసేలా కేంద్రం వెసులుబాటు కల్పించినట్లైంది.

## లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దీదీ

### '200 సీట్లు గెలవండని' బీజేపీకి సవాల్



న్యూఢిల్లీ, మార్చి 31 (ప్రభాత ఉదయం): పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదివారం లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వ్యాయామం చేస్తూ తలకు తగిలిన గాయం కారణంగా విశ్రాంతి తీసుకుని పూర్తిగా కోలుకున్న తరువాత ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఇదే మొదటి సారి. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు గెలవాలన్న లక్ష్యాన్ని ఎగతాళి చేశారు. కనీసం 200 నియోజకవర్గాలైనా గెలవాలని కాషాయ పార్టీకి సవాలు విసిరారు దీదీ. రాష్ట్రంలో జూూూ అమలు చేయడానికి ఆమె నిరాకరించడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'బీజేపీ '400 పార్' అంటోంది, ముందుగా 200 సీట్ల బెంచ్‌మార్క్‌ను దాటాలని కమలం పార్టీకి సవాలు చేస్తున్నా' అన్నారు. 2021 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో, ఇదే బీజేపీ 200 పైచిలుకు సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 77వద్దనే ఆగిపోవలసి వచ్చిందని అప్పటి అనుభవాలను గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ లోని కృష్ణానగర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ఏీజ అభ్యర్థి మహువా మొయిత్రా కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బిజెపిని 'జుమ్లా' పార్టీ అని అంటే అబద్దాలు చెప్పే పార్టీగా అభివర్ణించారు సీఎం మమత. పశ్చిమ బెంగాల్‌లో బిజెపితో చేతులు కలిపేందుకు సిద్ధమైన ప్రతిపక్ష కూటమి సిపిఐ, సీపీఎం, కాంగ్రెస్‌లను మమతా బెనర్జీ విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో భారత కూటమి లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బెంగాల్‌లో సిపిఐ, సీపీఎం, కాంగ్రెస్‌లు బిజెపి కోసం పనిచేస్తున్నాయని విమర్శించారు.

## కాంగ్రెస్ మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

రేవంత్ అంటడన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని ఇంతవరకు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతరన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రైతాంగాన్ని అడుగడుగునా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతులంటేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్నచూపని.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటేనే రైతులకు భరోసా అన్నారు. 280 మంది రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీ కారణమైందని.. 38 మంది ఆటో కార్మికుల ఆత్మహత్యలకు కారణమైంది కాంగ్రెస్ అంటూ ధ్వజమెత్తారు. 100 మందిరోజులుగా కాంగ్రెస్ పార్టీ ఉద్దెర మాటలు చెప్పింది గానీ ఉద్ధరించిందేమీ లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రైతులకు, ప్రజలకు కరెంటు కష్టాలు తప్పవని హెచ్చరించారు. దేవుళ్లను రాజకీయ కోసం వాడుకుంటున్న పార్టీ బీజేపీ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన దొంగలను మళ్లీ పార్టీలోకి తీసుకోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే.. ఎవరూ అధైర్యపడొదన్నారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి కార్యకర్తలకు ఇది పరీక్ష అని.. నా ఎన్నిక కోసం మీరు ఎంత కష్టపడ్డారో గాలి అనిల్ కుమార్ గెలుపు కోసం కూడా అంతే కష్టపడాలని కోరుతున్నానన్నారు. నాకొచ్చినంత మెజారిటీతో ఆయనను గెలిపించాలని.. కామారెడ్డి అభివృద్ధిని అడ్డుకున్నవాళ్లు ఈ రోజు ఇక్కడికొచ్చి సిగ్గులేకుండా ఓట్లు అడుగుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయని కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదన్నారు. రూ.2 లక్షలు రుణమాఫీ అయినోళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని.. కానివాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలన్నారు. కేసీఆర్ మాట తప్పని మనిషి అని.. కల్యాణలక్ష్మి, పింఛన్లు.. ఏ హామీ విషయంలోనూ మాట తప్పలేదని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి యాసంగి వడ్లకు, మక్కలకు 500 బోనస్ ఇస్తా అన్న మాటను నిలబెట్టుకోవాలని.. కారుకు ఓటేసి వాళ్లకు గుణపాఠం నేర్పాలన్నారు. ప్రతి నెల రూ.2,500, డిసెంబర్ నెల నుంచి ఇస్తామన్న హామీని



నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో రైతుబంధు ఆపకుండా కేసీఆర్ ప్రభుత్వం వేసింది. కాంగ్రెస్ వాళ్లు ఎకరాకు ఇస్తా అన్న రూ.15వేలు కాదు కదా.. రూ.10వేలు కూడా కోతలకు దగ్గర వచ్చిన వారి సరిగా ఇయ్యలే. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టాలన్నారు. అప్పుడే వాళ్లకు తాము మోసం చేశామని తెలుస్తుందన్నారు. తెలంగాణా కు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎన్నికలు దగ్గర వచ్చినయ్ కాబట్టే ఇవాళ పెట్రోల్, డీజిల్‌పై రూ.2 తగ్గించారని.. కేసీఆర్ కన్నా యజ్ఞ యాగాలు చేసిన ముఖ్యమంత్రి ఈ దేశంలో ఎవరు లేరన్నారు. బీజేపీ దేశంలో రైతుల కోసం, గిరిజనుల కోసం చేసిందేం లేదని.. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర రేవంత్ రెడ్డిదన్నారు. అవకాశవాదులను, ప్రలోభాలకు గురై పార్టీలు మారిన వారిని ఇక పార్టీలోకి తీసుకోబోమన్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున ప్రశ్నించే గొంతుకగా, ఆత్మగౌరవ ప్రతీక అయిన బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# యేసయ్య సజీవుడు



బుద్వేల్ లో జరిగిన యేసు పునరుత్థానం ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు



రంజిత్ రెడ్డి కి వినతిపత్రం ఇస్తున్న బుద్వేల్ ప్రజలు



లక్ష్మీ గూడ లో పాటలు పడుతున్న చర్చ్ పాస్టర్ రెవరెండ్ జాన్ వెస్లీ



రాజేంద్రనగర్ మన్నా చర్చ్ లో బైబిల్ సందేశాలు అందచేస్తున్న రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్



రాజేంద్రనగర్ చర్చి వద్ద....

## ఆయన మరణించి మూడవ దినమున తిరిగి లేచాడు యేసయ్య లో నిత్యజీవం

బుద్వేల్, మార్చి 31(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆదివారం క్రీస్తు పునరుత్థాన పండుగ ఆరాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గుడ్ ఫ్రైడే రోజున సర్వ మానవాళి పాప పరిహారార్థం కోసం ఏసుక్రీస్తు కలువరి సిలువలో మరణించి తిరిగి మూడవ దినమున లేచాడని భావించే క్రైస్తవ సమాజం ఆదివారం క్రీస్తు పునరుత్థాన పండుగ ను నిర్వహించారు. చర్చీలలో యేసు సజీవుడని, విమోచకు డని, నిత్యజీవం ఇచ్చేవాడని గుర్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్ మన్నా చర్చిలో రెవరెండ్ సిహెచ్ జాన్ మోజెస్ బైబిల్ సందేశాలను అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ సిహెచ్ ప్రభావతి పాల్గొన్నారు.

### బుద్వేల్ లో....

బుద్వేల్ జీహెచ్ఎంసి కార్యాలయం పక్కన క్రీస్తు పునరుత్థాన అరుణోదయ ఆరాధనలు ఘనంగా జరిగాయి. ఈ ప్రార్థనలో చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచానికి ప్రేమ , దయ, కరుణ ను చూపించిన మహనీయుడు ఏసుప్రభు అని గుర్తు చేశారు. బుద్వేల్ లో క్రీస్తు పునరుత్థాన పండుగలు జరుపుకునే స్థలాన్ని స్థానికులకు ఇప్పించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెథడిస్ట్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ అశోక్, రెవరెండ్ జోయల్, స్థానిక నాయకులు కోరని బాలరాజ్, కె ఎస్ దయానంద్, రగడంపల్లి శ్రావణ్, పలుగు చెరువు మహేష్ , అనుముల జాన్ పాల్, గోల్కొండ ప్రకాష్, బండ్లగూడ నరేందర్ తో పాటు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు, స్థానికులు పాల్గొన్నారు.

### వివిధ చర్చీలలో....

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ చర్చిలలో క్రీస్తు పునరుత్థాన పండుగ ఆరాధనలు ఘనంగా జరిగాయి. బుద్వేల్ సాయి కృష్ణ కాలనీ , చింతల్ మెట్ లోని బేతస్తా మిషన్ గాస్పెల్ చర్చీలలో రెవరెండ్ డాక్టర్ కె. నతానియల్ , సిస్టర్ కె. జయశ్రీ, కోనేటి ప్రార్థన మందిరంలో రెవరెండ్ ఎస్ యేసుమని, అత్తాపూర్ రాక్ చర్చిలో రెవరెండ్ కె సుందర్ పాల్, ఉప్పర్ పల్లి హెూరేబు గాస్పల్ చర్చిలో రెవరెండ్ పి స్వర్ణ కుమార్, అత్తాపూర్, హైదర్ గూడ ప్రార్థన మందిరాలలో బ్రదర్ రాజ్ కుమార్, పాస్టర్ పాలమాకుల మధు, రెవరెండ్ జే పీ పాల్, దుర్గానగర్ ఏలోహిమ్ గాస్పెల్ చర్చి లో రెవరెండ్ సిహెచ్ సునీల్ సామ్యూల్ , లక్ష్మి గూడా జీసస్ ప్రేయర్ మినిస్ట్రీస్ లో రెవరెండ్ జాన్ వెస్లీ , మధుబన్ కాలనీలో రెవరెండ్ విజయ్ కుమార్, పాస్టర్ షాలేమ్ రాజు, పాస్టర్ పాల్ దేవరాజ్ ల ఆధ్వర్యంలో క్రీస్తు పునరుత్థాన ఆరాధన లు జరిగాయి.



రూ.53 లక్షల చెక్కు ను డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్‌కు అందచేస్తున్న ఏఎంసీ జయ ప్రకాష్. చిత్రం లో సురేష్ ను చూడవచ్చు.

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో 97.46 శాతం ఆస్తి పన్ను వసూలు

బుద్వేల్, మార్చి31(ప్రభాత ఉదయం): 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు ఆదివారం రాత్రి 8 గంటల సమయానికి 97.46% ఆస్తి పన్ను వసూలు చేశారు . రాజేంద్రనగర్ సర్కిల్ కు రూ. 52.46 కోట్లు టార్గెట్ గా ఉండగా రాత్రి 8 గంటల వరకు రూ.51.13 కోట్లు వసూలు చేశారు . అందుకు సహకరించిన రాజేంద్రనగర్ ఏఎంసీ జయప్రకాష్, టాక్స్ ఇన్స్ పెక్టర్లు, బిల్ కలెక్టర్ల కు డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ ధన్యవాదాలు తెలియజేశారు . రాజకీయ పార్టీల నాయకులు, మీడియా మిత్రులు ఆస్తిపన్ను వసూలు లో పరోక్షంగా ఎంతగానో సహకరించారన్నారు. ఆదివారం ఒక్క రోజే రూ. 3 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయడం జరిగిందన్నారు. కాటేదాన్ కు చెందిన రవి ఫుడ్స్ నుంచి రూ. 53 లక్షలు చెక్కు రూపంలో తీసుకున్నామన్నారు.



బాబుల్ రెడ్డి నగర్ వద్ద భారీ గేట్లను ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

### ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్

రాజేంద్రనగర్, మార్చి 31(ప్రభాత ఉదయం) ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ కు చెందిన నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ సీఐ కిరణ్ కుమార్ కి బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ రద్దీగా ఉండే నివాస ప్రాంతం, వారి రోజువారీ అవసరాల కోసం ప్రజా రవాణా , ఇతర ప్రయాణ మార్గాలపై ఆధారపడిన నివాసితులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారని వారు ప్రమాదాల గురవుతున్నారని నివారణకు చర్యలు తీసుకోవాలని ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లటం వెంటనే స్పందించారు .దుర్గా నగర్ నుండి ఆరంఘర్ వరకు సురక్షితమైన పాదచారుల క్రాసింగ్‌ల పరంగా మా కమ్యూనిటీకి ఒక ముఖ్యమైన సమస్యగా మారటంతో నవ యువ యూత్ క్లబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ దృష్టికి సమస్యలను వివరించింది అందుకు సానుకూలంగా స్పందించిన కిరణ్ కుమార్ వెంటనే రోడ్డు క్రాసింగ్కు భారీ గేట్లను ఏర్పాటు చేశారు.గత కొన్ని నెలలుగా, రద్దీగా ఉండే హైవేను దాటడానికి ప్రయత్నించే వ్యక్తులు గాయపడడం , ప్రమాదాలకు గురికావడం, ఫలితంగా జీవితాన్ని మార్చివేసే అనేక దురదృష్టకర సంఘటనలను జరిగాయని ట్రాఫిక్ సిఐ కిరణ్ కుమార్ దృష్టికి వినతి పత్రం ద్వార సమస్యను తీసుకెళ్లడం జరిగింది. సిఐ కిరణ్ కుమార్ వెంటనే స్పందించి బాబుల్ రెడ్డి నగర్ వెళ్లే క్రాసింగ్ ( యూటర్న్) ను మూసి వేశారు. ఈ యుటర్న్ ద్వారా వాహనం దారులు తరచుగా ప్రమాదాలకు గురి కావడం జరిగింది. అదేవిదంగా పాదచారుల క్రాసింగ్‌ల ఏర్పాటు, స్పీడ్ బంప్‌లు, కూడాఏర్పటు చెయ్యాలని కోరడం జరిగింది. వాహనదారుల సమస్యను పరిష్కరించినందుకు సిఐ కిరణ్ కుమార్ కి నవ యువ యూత్ క్లబ్ తరపున బాబుల్ రెడ్డి నగర్ వాసుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బృందావన్ కాలనీలో తప్పిపోయిన బాలుని ఆచూకీ మల్కాజిగిరి రైల్వేస్టేషన్లో లభ్యం

బుద్వేల్, మార్చి31(ప్రభాత ఉదయం) : శుక్రవారం మైలార్ దేవుపల్లి డివిజన్ బృందావన్ కాలనీలో తప్పిపోయిన రోహన్( 10 ) మల్కాజ్ గిరి రైల్వే పోలీసులకు లభించాడు. మల్కాజిగిరి రైల్వే స్టేషన్ లో అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు అతని చేరదీసి వివారాలు అడిగారు . దీంతో అతను వారి తల్లిదండ్రుల పేరు వెల్లడించాడు . ఆ బాలుడు చెప్పిన వివరాల ప్రకారం మైలార్ దేవ్ పల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం కావడంతో బాలుడిని సోమవారం తల్లిదండ్రులకు అప్పగించే అవకాశం ఉంది.




## మైనర్ బాలిక హత్య కేసులో మోయిన్ అనే వ్యక్తి అరెస్ట్.. రిమాండ్

బుద్వేల్, మార్చి31(ప్రభాత ఉదయం) : మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద హత్యకు గురైన మైనర్ బాలిక కేసులో మోయిన్(31) అనే నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్ కు తరలించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సులేమాన్ నగర్ ప్రాంతంలో తమ ఇంటి పక్కన ఉండే 13 సంవత్సరాల బాలికతో మోయిన్ కు పరిచయం ఏర్పడి అది ప్రేమకు దారి తీసింది. దీంతో బాలిక తల్లిదండ్రులు అక్కడి నుంచి వారి మకాం ను జల్ పల్లి కి మార్చారు. అయినా మోయిన్ ఆ బాలికతో టచ్ లో ఉన్నాడు. ఈనెల 28న బాలిక మోయిన్ ను కలిసి పెళ్లి చేసుకోవాలని కోరింది. అప్పటికే పెళ్లై మో యిన్ కు నలుగురు సంతానం ఉన్నారు. మైనర్ బాలికను ఎలాగైనా వదిలించుకోవాలని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తీసుకొచ్చి ఆ బాలికను గత గురువారం రాత్రి హత్య చేశాడు . సమాచారం తెలుసుకున్న పోలీసులు విశ్వసనీయ సమాచారము మేరకు మోయిన్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.




# కిస్మత్‌పూర్ రాక్ చర్చ్‌లో యేసు క్రీస్తు పునరుత్థాన పండుగ జరుపుకున్న క్రైస్తవ విశ్వాసులు



యేసు ప్రభువు పునరుత్థానం ఆరాధనలో మన్నా మినిస్ట్రీస్ సహా వ్యవస్థాపక అధ్యక్షురాలు బిషప్ రేచల్ జ్యోతి కోమానపల్లి.



యేసు పునరుత్థానం ఆరాధనలో కిస్మత్ పూర్ రాక్ చర్చ్ లో జరిగిన ఆరాధన లో బైబిల్ సందేశాలను అందచేస్తున్న గోదావరి ఖని కి చెందిన బిషప్ సత్య ప్రకాశనంద ను సన్మానిస్తున్న పాస్టర్లు



యేసు క్రీస్తు పునరుత్థాన శక్తి ని తెలిపే నాటికను ప్రదర్శించిన రాజేంద్రనగర్ మన్నా చర్చ్ యవనస్థులు



యేసు పునరుత్థానం ఆరాధనలో కిస్మత్ పూర్ రాక్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సురేష్



బిషప్ రేచల్ జ్యోతి కోమానపల్లి తో క్రైస్తవ విశ్వాసులు

## ఆయన తిరిగి లేచాడని సంతోషంతో ప్రార్థనలు

బుద్వేల్, మార్చి31(ప్రభాత ఉదయం): యేసు ప్రభువు పునరుత్థాన పండుగను ఆదివారం రాక్ చర్చ్ క్యాంపస్ లో ఘనంగా నిర్వహించారు . మన్నా మినిస్ట్రీస్ సహా వ్యవస్థాపక అధ్యక్షురాలు బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి . ప్రార్థనలో గోదావరి ఖని ప్రాంతానికి చెందిన బిషప్ సత్య ప్రకాశానంద బైబిల్ సందేశాలను అందజేశారు. యేసు ప్రభువు మరణించి మూడవ దినమున తిరిగి లేచాడని దానినే యేసు పునరుత్థాన పండుగ అని క్రైస్తవులు నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆయన మరణంతో క్రైస్తవులకు నిత్యజీవం ప్రసాదించబడిందని గుర్తు చేశారు. యేసు ప్రభువు ను విశ్వసిస్తున్న ప్రజలకు ఈ లోకంలో అనేక శ్రమలు రావడం సహజమే అన్నారు. వాటి నన్నిటిని సహించి యేసయ్య కోసం జీవించినప్పుడు ఆయనను నమ్ముకున్న ప్రజలకు నిత్య జీవం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కాకినాడ కు చెందిన బ్రదర్ సునీల్, సిస్టర్ సుజాత లు క్రైస్తవ ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఈ ప్రార్థనలలో పాస్టర్లు రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, రెవరెండ్ జే. ఏలియా బాబు, రెవరెండ్ డి వి సమర్పణ రావు, రెవరెండ్ కె. సుందర్ పాల్, రెవరెండ్ సురేష్, రెవరెండ్ జ్యోతి సంపత్, పాస్టర్ రాజేష్ లు. పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంట్ స్థానంపై బీజేపీ జెండాను ఎగురవేస్తా: కొండా విశ్వేశ్వర్ రెడ్డి



వేదిక పై నుంచి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వరరెడ్డి

బుద్వేల్, మార్చి 31 (ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ నియోజకకవర్గం లో లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ అధ్యక్షతన ఆదివారం ఉప్పర్ పల్లి, పిఆర్ ప్యాలెస్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అథిధిగా చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో తాను చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. యాత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రతీ గ్రామంలో తాగు నీటి, సాగునీటి సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయని విశ్వేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమంతో పాటు మౌలిక వసతులు కల్పించడంలో గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చేవెళ్ల ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మరో వారం రోజుల్లో హైదరాబాద్ నగర ప్రాంతాల్లోనూ ప్రజా ఆశీర్వాద యాత్రతో పాటూ.. పూర్తి స్థాయి ప్రచారం మొదలు పెడతామన్నారు. బీజేపీని గెలిపించి నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నాయకులు ప్రతీ కార్యకర్తను మమేకం చేయడం ద్వారా పార్టీని గెలిపించాలని సూచించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి, మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ , టి అంజన్ కుమార్ గౌడ్ , బుక్క వేణుగోపాల్, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లారెడ్డి , రాజేంద్రనగర్ నియోజకవర్గం కో కన్వీనర్ బి మహలింగం గౌడ్, యువమోర్చా రాష్ట్ర నాయకుడు బొక్క బాల్ రెడ్డి, కాడెం సుధాకర్, జోగి రవి, అత్తాపూర్ కార్పొరేటర్ ఎం. సంగీత, నియోజకవర్గం నాయకులు నరేందర్, డి లక్ష్మీనారాయణ , నగేష్, నందకిషోర్ , చంద్రయ్య, కె నరేందర్ రెడ్డి , షాబాద్ విజయకుమార్ , జి బాబూరావు , అడిక జనార్ధన్, సిహెచ్ వెంకటయ్య , దేవేందర్, బిక్షపతి యాదవ్ , బీరప్ప, మహేష్ యాదవ్ , నిఖిల్ విక్రం చారి తదితరులు పాల్గొన్నారు




# నగరంలో నీటి కొరత

## పెరిగిన టాంకర్ల డిమాండ్

### ప్రజా అవసరాలకు అనుగుణంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్, మార్చి31(ప్రభాత ఉదయం):నగరంలోని భూగర్భ జలాలు అడుగంటిపోయి. ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.ఒకటి రెండు షిఫ్టులలో సరఫరా సరిపోవట్లేదు.ఈ నేపథ్యంలో జలమండలి సమస్య నివారణ చర్యలకు ఉపక్రమించింది.ఇప్పటికే కొత్తగా 20 ఫిల్లింగ్ స్టేషన్లు,మూడో షిఫ్ట్ ఏర్పాటు చేసింది.నగరంలో నీటి కొరత..వాటికి పెరిగిన డిమాండ్..అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు..నగరంలోని భూగర్భ జలాలు అడుగంటిపోయి.ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.ఒకటి రెండు షిఫ్టులలో సరఫరా సరిపోవట్లేదు.ఈ నేపథ్యంలో జలమండలి సమస్య నివారణ చర్యలకు ఉపక్రమించింది.ఇప్పటికే కొత్తగా 20 ఫిల్లింగ్ స్టేషన్లు,మూడో షిఫ్ట్ ఏర్పాటు చేసింది.అదనపు ట్యాంకర్లు,డ్రైవర్లను సమకూర్చుకుంటున్నట్లు ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు.పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిశోర్ సూచన మేరకు జీహెచ్ఎంసీ నుంచి 200 మంది డ్రైవర్లను సమకూర్చు కుంటున్నామని..దీనికి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ కూడా అంగీకరించినట్లు వెల్లడించారు.ఈ డ్రైవర్లకు నేడు జలమండలి ప్రధాన కార్యాలయంలో ఒక రోజు ఓరియెంటెషన్ ప్రోగ్రాం నిర్వహించారు.వీరంతా మూడో షిఫ్ట్ రాత్రి సమయాల్లో వాణిజ్య వినియోగదారులకు నీరు సరఫరా చేసేందుకు పనిచేయనున్నారు.



ఎంపీ రంజిత్ రెడ్డిని కలిసిన భవాని కాలనీ మాజీ అధ్యక్షులు, రిటైర్డ్ ఏఎస్ఐ గోల్కొండ యాదయ్య

# ప్రజా ఆశీస్సులతో మరోసారి విజయం సాధిస్తా: ఎంపీ రంజిత్ రెడ్డి

### ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

రాజేంద్రనగర్, మార్చి31(ప్రభాత ఉదయం) ప్రజలకు గత ఐదేళ్లు నిరంతరం అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని మరోసారి ప్రజలు ఆశీర్వదిస్తారని చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి రంజిత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్ ల కు చెందిన నాయకులు చేవెళ్ల ఎంపీ, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డిని భవాని కాలనీ మాజీ అసోసియేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ అభిమాని, మాజీ పోలీస్ అధికారి గోల్కొండ యాదయ్య మర్యాదపూర్వకంగా డాక్టర్ రంజిత్ రెడ్డిని కలిసి సత్కరించారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ని మైలార్దేవ్పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్ ధనుంజయ ఆధ్వర్యంలో కలసి స్వాగతించారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ... రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమ అభివృద్ధి అందరికీ అందే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందని , దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరిచే విధంగా తెలంగాణలో అన్ని పార్లమెంటు సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. పదవి విరమణ చేసిన ఏఎస్ఐ గోల్కొండ యాదయ్య భవానీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత నిరంతరం స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజాప్రతినిధులకు వివరిస్తూ పరిష్కరించడంలో నిరంతరంకు చేస్తున్నారు. ఈ విషయాన్ని డాక్టర్ రంజిత్ రెడ్డికి వివరిస్తూ భవిష్యత్తులో తమ కాలనీలో మారిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నరసింహ యాదవ్, సాయి రెడ్డి ,శ్రీరాములు, రవీందర్ రెడ్డి, వెంకటేష్ ,లక్ష్మణ్, శ్రీశైలం ,ఉస్మాన్ ,సతీష్, శ్రీనివాస్, రమేష్, ఫరీద్, దస్తగిరి, జోబెర్, యాదయ్య, కిషోర్ రాంబాబు ,శేఖర్, నిరంజన్, నిఖిల్ ,రవి ముదిరాజ్, ధనం రెడ్డి, ఎజాజ్, విజయ్, ఓం ప్రకాష్ ,శ్రీనివాస్, సుధాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ప్రజల అభిమానం ఎప్పటికీ మరువలేను

### ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి



బుద్వేల్ ఈస్టర్ ఉత్సవాల్లో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి డాక్టర్ జి రంజిత్ రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి 31(ప్రభాత ఉదయం) స్థానిక ప్రజలు చెబుతున్న అభిమానాన్ని నేను ఎన్నటికీ మరువలేనని వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని చేవెళ్ల ఎంపీ, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి రంజిత్ రెడ్డి అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో ఈస్టర్ ఉత్సవాలలో పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు డాక్టర్ రంజిత్ రెడ్డికి స్థానిక అంశాలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్తులో ప్రజల హితం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా నాయకులు కోరని బాలరాజు, కె ఎస్ దయానంద్, ప్రకాశం, పలుగు చెరువు మహేష్, గోల్కొండ రాజ్ కుమార్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కస్తూరి నరేందర్ ను సన్మానిస్తున్న గ్రామస్తులు

# మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ కస్తూరి నరేందర్

### మల్లన్న జాతరలో పాల్గొన్న కస్తూరి నరేందర్.

శంషాబాద్, మార్చి 31( ప్రభాత ఉదయం) మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ కస్తూరి నరేందర్ అన్నారు. ఆదివారం శంషాబాద్ మండలంలోని చౌదరి గూడ గ్రామంలో జరిగిన మల్లన్న జాతర కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కస్తూరి నరేంద్ర ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చౌదర్ గూడ లో జరిగిన మల్లన్న జాతర కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు తీసుకుని మల్లన్న స్వామిని దర్శనం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, చిలకమర్రి మహేందర్, పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్ , జిల్లా ఆనంద్, గోనెల గోవర్ధన్, సప్తగిరి గౌడ్, జహంగీర్ ,శ్రీనివాస్,మల్లికార్జున్, ప్రేమ్ అలోక్, బొర్రా నందు, శివ, విక్రమ్, సాయి, రాజు, విజయ్, మల్లేష్,కన్నా, దేవేందర్,లింగం, ప్రభాకర్, భిక్షపతి, మహేష్,తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానేశ్వర్ ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానించిన శేఖర్ యాదవ్

శంషాబాద్,మార్చి 31(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ ఫెడరేషన్ చైర్మన్ గా నియమితులైన రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను శంషాబాద్ మండల శాఖ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ సన్మానించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను ఇటీవల రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా ప్రభుత్వం నియమించింది. శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ యాదవు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మండల్ ఉపాధ్యక్షులు రమేష్. అశోక్ బంగారం కుమార్. గణేష్ నాయక్. బషీర్. కొమురయ్య. శేఖర్ యాదవ్. వెంకట్ రెడ్డి. శ్రీనివాస్ యాదవ్. రవి నాయక్. సీను నాయక్. దేవేందర్. రాకేష్. సత్యం. సంజు. మహేష్ యాదవ్. శ్రీరాములు. నగేష్. కిరణ్. సిద్దు. విజయ్. రఘు. శివ యాదవ్. ప్రవీణ్. తదితరులు పాల్గొన్నారు.



# శంషాబాద్ మండలం కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా బంగారం కుమార్

శంషాబాద్,మార్చి 31, (ప్రభాత ఉదయం) శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా బహదూర్ గూడ కు చెందిన బంగారం కుమార్ ను నియమించినట్లు మండల శాఖ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ తెలిపారు. బహదూర్ గూడ గ్రామానికి చెందిన బంగారం కుమార్ ను పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని శేఖర్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లోచేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి విజయానికి కృషి చేస్తానని అన్నారు. తనపై విశ్వాసంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని అన్నారు.



విద్యుత్ శాఖ ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ చేసిన కొండా రెడ్డి ని సన్మానిస్తున్న భీమ్ రెడ్డి

# కొండారెడ్డి ప్రజలకు నిరంతరం సేవలు అందించారు

### పదవి విరమణ సందర్భంగా కొండారెడ్డిని సన్మానించిన నాయకులు

కొత్తకోట, మార్చి31(ప్రభాత ఉదయం) విద్యుత్ శాఖలో ఉద్యోగులుగా పనిచేసిన సారెడ్డి కొండారెడ్డి పదవి విరమణ చేశారు. ఆదివారం వనపర్తి పట్టణ కేంద్రంలో కళ్యాణ సాయి గార్డెన్ లో ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ లో అపారమైన సేవలందించి ఆదివారం పదవి విరమణ పొందిన సారెడ్డి కొండారెడ్డి దంపతులను సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా భీమ్ రెడ్డి మాట్లాడుతూ... కొండారెడ్డి శేష జీవితం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# వాటర్ వర్క్స్ లైన్ మెన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి



గాయపడ్డ వాటర్ వర్క్స్ లైన్ మెన్ పి. జగదీష్

బుద్వేల్, మార్చి31(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి సులేమాన్ నగర్ డివిజన్ నౌ నెంబర్ లోని ఆదివారం ఉదయం 6 గంటలకు వాటర్ వర్క్స్ లైన్ మెన్ పి జగదీష్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏ ఐ టీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనం పల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అత్తాపూర్ పోలీసులకు పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డైరీ ఫారం పిల్లర్ నెంబర్ 207 దగ్గర రెండు రోజుల క్రితం కార్మికులపై జరిగిన దాడి సంఘటన మరువకముందే అదే సులేమాన్ నగర్ డివిజన్ పరిధిలో ఆదివారం ఉదయం 6 గంటలకు వాటర్ లైన్ మెన్ పి.జగదీష్ దాడి జరగడం బాధాకరం అన్నారు. ఆదివారం నీళ్లు వదలడం జరిగిందని, రోడ్ మీద వాటరు వేస్ట్ గా కడుగుతుంటే ఎన్నోసార్లు వేస్ట్ చేయవద్దని అని చెప్పడం జరిగిందని లైన్ మెన్ తెలిపాడు. అయినా కూడా అదే విధంగా నీళ్లను వేస్ట్ చేస్తుంటే చెయ్యొద్దని ఫోటో తీస్తుంటే ఫోన్ లాక్కొని దాడి చేయడం జరిగిందన్నారు. ఎండాకాలం మరొకపక్క నీటి కష్టాలు ఉన్నందున వేస్ట్ చేయవద్దు అన్నందుకు కొట్టడం జరిగిందన్నారు. కార్మికులపై ఇలాంటి దాడులు జరిగితే కార్మికులు ఏ విధంగా విధులు నిర్వహిస్తారని అన్నారు. ఇలాంటి దాడులు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి లేదంటే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్స్ , మలేరియా , తదితర డిపార్ట్మెంట్లో పని చేసే కార్మికుల తోటి కలసి ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.

# మహనీయుల ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి







### తోకల శ్రీనివాస్ రెడ్డి, సంగీత, నవాజుద్దీన్

రాజేంద్రనగర్, మార్చి 31(ప్రభాత ఉదయం) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, భారత ప్రథమ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మైలార్ దేవుపల్లి, అత్తాపూర్ డివిజన్ల కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఎం సంగీత, ఎంఐఎం నాయకులు నవాజుద్దీన్ లు అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ-2024 ఆధ్వర్యంలో కార్పొరేటర్ లను వారి స్వగృహాలకు వెళ్లి ఆహ్వాన పత్రాలు అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలోజయంతి ఉత్సవాల రాజేంద్రనగర్ సర్కిల్ కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు,ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం,కోశాధికారి రగడంపల్లి శ్రావణ్ ఆధ్వర్యములో కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి,పొడుగు అర్చన జయ ప్రకాష్,యం.సంగీత గౌరిశంకర్,అబేధా సుల్తానా, మోబిన్ లను కలిసి బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలకు ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సవాల వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులు పోయిల జీవన్ దాస్, మాజీ అధ్యక్షులు టి.ఆర్.శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ ,కోరని దయానంద్, గోల్కొండ రాజ్ కుమార్,పంబాల రాజు,బాబురావు,ప్రీతం రాజ్,తలారి రాజ్ కుమార్,బర్ల సుమన్,జంగయ్య,ఉపేందర్,సంజీవ,ఎడ్లకాడి చంద్ర శేకర్,బచ్చుల మహేష్,కవ్వగూడెం గౌతమ్,రమేష్ మాదిగ,పోయిల వికాస్,తదితరులు ఉన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.